సంస్కార భారతి శారదానగర్ శాఖ ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

వనస్థలిపురం: సంస్కార భారతి (జాతీయ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ) నూతన శాఖ సోమవారం రాత్రి వనస్థలిపురం శారదానగర్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాగ్దేవు శివాజీ మాట్లాడుతూ.. సంస్థ ప్రధాన ఉద్దేశాలు, విధి విధానాలను వివరించారు. దేశభక్తి, కళా, సాంస్కృతిక సామాజిక సేవా భావం కలిగినవారు, ముఖ్యంగా యువతను తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకతను ప్రస్తావించారు. డా.శిరిపురపు అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆనంద్, అంజిరెడ్డి, కృష్ణకుమార్, సైదమ్మ, గోవిందాచారి, చంద్రమౌళి, లక్ష్మీదుర్గ, నరసింహం, ప్రసాద్, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సంస్కృత దినోత్సవం

వనస్థలిపురం: వనస్థలిపురం శారదానగర్ శాంతినగర్ కల్వంచలో టెలికాం రిటైర్డు డీజీఎం బి.పరమేశ్వరుడు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం జాతీయ సంస్కృత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, సంస్కృత పండితులు పీటీజీవీ. రంగాచార్యుల దంపతులకు పాదపూజ, పండిత సత్కారం నిర్వహించారు. రంగాచార్యులు సంస్కృత భాష ప్రాముఖ్యం, ప్రస్తుత పరిస్థితుల్లో దాని అవసరాన్ని వివరించారు. డా.శిరిపురపు అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆచార్య వాసుదేవ్, చక్రవర్తుల శ్రీనివాసాచార్య, టి.యాదగిరి రావు, సీహెచ్.మంగపతిరావు, కళా వికాసరత్న చొదూరి నరసింహరావు, డా.ఏనుగు శివరామప్రసాద్, నాగప్రభాకర్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగాచార్యులు

ముగిసిన నాటిక పోటీలు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని చంద్రకళా వేదికపై గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న నవమ ఆహ్వాన పౌరాణిక పద్యనాటిక పోటీలు సోమవారంతో ముగిశాయి. జడ్చర్లకు చెందిన నవజ్యోతి కళామండలి వారు ప్రదర్శించిన మైరావణ నాటికకు ప్రథమ బహుమతి, ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన బ్రహ్మర్షి విశ్వామిత్రకు రెండవ బహుమతి, పఠాన్‌చెరుకు చెందిన టీబీఆర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన స్వామి అయ్యప్ప నాటికకు తృతీయ బహుమతి, కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటికకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. ఉత్తమ నటుడిగా రఘురామశర్మ, ఉత్తమ నటిగా లీలావతి, ఉత్తమ ప్రతి నాయకుడిగా పార్వాచారి ఎంపికయ్యారు. విజేతలకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి చేతులమీదుగా మెమొంటో, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య కన్వీనర్ వి.వి.సుబ్బారావు, అధ్యక్షులు పంపన వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, సోమయాజులు, పుండరీకాక్షుడు, సూర్యప్రకాష్, సత్యనారాయణ, రామచంద్రరావు, అచ్యుత రామయ్య, సూర్యనారాయణ, జైపాల్‌రెడ్డి, బుగ్గయ్య పాల్గొన్నారు.



విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

దోమల నివారణపై అవగాహన

ఎల్‌బీనగర్: వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దోమల నియంత్రణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆడ ఎనాఫిస్ దోమవల్ల మలేరియా వ్యాధి వస్తుందనే విషయంపై సర్ రోనాల్డ్‌రాస్ 1897 ఆగస్టు 20న కనుగొన్న సందర్భంగా ప్రతి సంవత్సరం ఇదే రోజు ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకుంటున్నారని, దోమల వల్ల కలిగే వ్యాధులు, నివారణ మార్గాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. దోమల నివారణకు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంటమాలజీ సిబ్బంది నరేందర్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి

మూసీ పరీవాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి



మలక్‌పేట: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన మూసారంబాగ్‌లో మూసీనది తీర ప్రాంతాలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ధోబీఘాట్‌లో ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. గతంలో భారీవర్షం కురిస్తే బ్రిడ్జిపై రాకపోకలు సాగించలేని పరిస్థితులు ఉండేవని బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

మన్సూరాబాద్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, జోగు రాములు హాజరై రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు.



ఎల్‌బీనగర్ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

బైరామల్‌గూడ చౌరస్తాలో..

చంపాపేట: భారతదేశంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసిన ఘనత మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బైరామల్‌గూడ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బద్రీనాథ్, ప్రకాష్ గుప్తా, కిరణ్, శివ, వెంకటేష్, అనసూయ, శ్రీనివాస్ రెడ్డి, రాము, వెంకట్, రమణారెడ్డి పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఆర్‌కేపురం డివిజన్‌లో..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్‌లో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశాన్ని సాంకేతికంగా అభివృద్ధి పథంలో నడిపించి ఆధునికతకు మార్గం చూపిన దార్శనికుడన్నారు. ప్రతి ఒక్కరు రాజీవ్‌గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ యాదవ్, రాజు నాయక్, పెద్దపూర సైదులు, శేఖర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ నగర్‌లో..



ఇంట్లోకి చేరిన నీటిని తోడి పోస్తున్న వృద్ధురాలు

అయ్యప్పకాలనీలోని ఓ ఇంట్లోకి చేరిన నీరు

నాగోలు/ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో మంగళవారం కురిసిన వర్షానికి కాలనీలు, బస్తీల్లో భారీగా వరద పారడంతో రోడ్లు, రహదారులు చెరువులను తలపించాయి.

- కొత్తపేట డివిజన్ ఎస్ఆర్ఎల్, కాలనీలో వర్షం నీటితో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మన్సూరాబాద్, నాగోలు, సాగర్ రింగ్‌రోడ్డు, లింగోజిగూడ, చైతన్యపురి పరిధిలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అయ్యప్పనగర్ కాలనీలో కొన్ని ఇళ్లలోకి నీరు చేరి సామగ్రి తడిసిపోయింది. వివిధ కాలనీల్లో చెట్లు కూలిపోయాయి. నాగోలు శ్మశాన వాటిక ప్రహరీ కూలిపోయి సమాధులు సైతం ధ్వంసమయ్యాయి.

చైతన్యపురి/మన్సూరాబాద్: గడ్డిఅన్నారం డివిజన్‌లోని కమలానగర్, న్యూగడ్డిఅన్నారం, పీఅండ్‌టీ కాలనీ, వీవీనగర్ ప్రాంతాల్లో రహదారులపై వరద పారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులోని వరద నీరు చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లోకి చేరింది. ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు, అధికారులు పర్యటిస్తూ వరద సాఫీగా పారేలా చర్యలు చేపట్టారు.

కుమ్మేసిన వాన.. కమ్మేసిన వరద

- చెరువులను తలపించిన రహదారులు
- కాలనీలు, బస్తీల్లో పారిన వరద
- పలు ఇళ్లలోకి చేరిన నీరు
- ఇబ్బందులు పడ్డ జనాలు



మన్సూరాబాద్ డబుల్‌బెడ్‌రూం సముదాయాల వద్ద..

వర్షానికి కూలిపోయిన నాగోలు శ్మశానవాటిక ప్రహరీ

వనస్థలిపురం హైకోర్టు కాలనీలో..

కొత్తపేట ఎస్ఆర్ఎల్ కాలనీలో

జలమయంగా మారిన ఆర్‌కేపురంలోని ప్రధాన రహదారి

గడ్డిఅన్నారంలో..

సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పర్యటించిన అనంతరం భూపేష్‌గుప్తానగర్‌కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు కాలనీలకు చెందిన మహిళలు కార్పొరేటర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, రేణుకగౌడ్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీనివాస్‌యాదవ్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారిగా శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీపీ ప్రసాదరావు హెచ్‌ఎండీఏకు బదిలీ అయ్యారు. మల్కాజిగిరి సర్కిల్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్ యాదవ్‌ను ఎల్‌బీనగర్ జోనల్ రెగ్యులర్ ఇన్‌చార్జి సీపీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ అనుమతుల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తామన్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. జోనల్ పరిధిలో సుమారు 39 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు.

కత్తితో సంచరిస్తున్న యువకుడిపై కేసు

చంచల్‌గూడ: కత్తితో సంచరిస్తున్న ఓ యువకుడిపై కేసు నమోదు చేసిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాఖీ పండుగ రోజు అర్ధరాత్రి రెయిన్‌బజార్ వాటర్ ట్యాంక్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అక్కడే ఇద్దరు యువకులు సయ్యద్ యూసుఫ్ (29) అబ్దుల్ అహ్మద్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్దకు పోలీసులు వెళ్తుండగా ఒకరు పరారయ్యారు. పట్టుబడ్డ సయ్యద్ యూసుఫ్ వద్ద కత్తి లభించడంతో కేసు నమోదు చేశారు.

నేటి నుంచి వార్షిక ఉత్సవాలు



ముస్తాబైన అభయాంజనేయస్వామి దేవాలయం

మన్సూరాబాద్: డివిజన్ పరిధి మల్లికార్జుననగర్‌కాలనీ (నార్త్)కాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామి 11వ వార్షిక ప్రతిష్టాపక ఉత్సవాలు బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. బుధవారం ఉదయం మన్యసూక్త హోమం, సాయంత్రం 7 గంటలకు విష్వక్సేన పూజ, గురువారం ఉదయం 7 గంటలకు స్వామికి ప్రత్యేక మహాన్యాస రుద్రాభిషేకం, మూలమంత్రహోమం, గణపతి హోమం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు.

జహీరాబాద్ కోహీర్ అల్లం కొనుగోలు చేయాల్సిందే



వ్యాపారులు, రైతులతో చర్చిస్తున్న రవికుమార్

చాదర్‌ఘాట్: జహీరాబాద్ కోహీర్ అల్లంను కొనుగోలు చేయాల్సిందేనని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ ఆదేశించారు. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మంగళవారం ఆయన కోహీర్ రైతులు, అల్లం కొనుగోలుదారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలతో రైతులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అల్లాన్ని నెలరోజుల పాటు కొనుగోలు నిలుపుదల చేసి కోహీర్ అల్లం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమములో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, ఎస్‌జీఎస్ మల్లేషం, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు, ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్–1 అధికారి నర్సింహారెడ్డి, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.15, వంకాయ రూ.23, బెండ రూ.18, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.20, బీరకాయ రూ.23, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.45, దొండ రూ.25, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.44, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.13, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.10, అర్వి రూ.23, మునగ రూ.28, చిలుకడదుంప రూ.50, బీట్‌రూట్ రూ.28, కీర రూ.21, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.55. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



రమణ

మలక్‌పేట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. ఏఎస్సై తేజ్‌నాయక్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురం మండలం, గురుజాపాలెం గ్రామానికి చెందిన చెమ్మదేవి కుమార్తె దిల్‌సుఖ్‌నగర్ శారద హాస్టల్లో ఉంటూ సినిమా షూటింగ్‌లలో పని చేస్తోంది. దేవి తన తండ్రి ఎల్. రమణ(62)తో కలిసి కుమార్తెను చూడటానికి ఈ నెల 14న దిల్‌సుఖ్‌నగర్‌లోని హాస్టల్ వద్దకు వచ్చారు. లేడీస్ హాస్టల్ కారణంగా రమణను లోపలికి అనుమతించలేదు. దేవి తన కుమార్తెను చూడటానికి హాస్టల్ లోపలికి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు తర్వాత బయటకు రాగా తండ్రి రమణ కన్పించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శుభకార్యానికి వచ్చిన వ్యక్తి..



నడిమి దొడ్డి నింగప్ప

శుభకార్యానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి, రాయికోడ్ మండలానికి చెందిన నడిమిదొడ్డి మణెమ్మ(60) ఈ నెల 16 తేదీన మూసారంబాగ్ రజకసంఘంలో జరుగుతున్న బంధువుల శుభకార్యానికి కొడుకు నడిమిదొడ్డి నింగప్ప(41)తో కలిసి వచ్చింది. కార్యక్రమం అనంతరం ఆమె తన సొంత గ్రామానికి వెళ్లింది. నింగప్ప గ్రామానికి రాకపోవడంతో ఎన్టీఆర్‌నగర్‌లో ఉంటున్న తన కుమారుడు అనిల్ దగ్గరకు వెళ్లాడని భావించింది. అతనికి ఫోన్ చేసి విచారించగా తన దగ్గరకు రాలేదని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.